సాక్షి చిత్తూరు

గురువారం। 3। ఏప్రిల్। 2025



13 నెలలు జీతాలివ్వకపోతే ఎలా?

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలలుగా జీతాలివ్వకపోతే ఎలా అని సీఐటీయూ నేత గంగరాజు ప్రశ్నించారు. - 8లో



కొత్తమార్గం.. మణిహారం

కుప్పం-బెంగళూరు మధ్య కొత్త మార్గం ఏర్పాటు కానుంది. ఈ రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుంది. - 8లో



వ్యవస్థాపక విద్యకు ప్రాధాన్యం

జిల్లాస్థాయి నుంచే వ్యవస్థాపక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

జగనన్నతో మాజీ మంత్రి ఆర్కే రోజా భేటీ



మాజీ సీఎం జగన్‌తో ఆర్కేరోజా

నగరి : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి ఆర్కేరోజా బుధవారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో కలిశారు. పలకరింపుల అనంతరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు మాజీ మంత్రి రోజా తెలిపారు.

ఏపీపీజీసెట్-2025కు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: ద్రవిడ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో నిర్వహించే ఏపీపీజీసెట్-2025 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఏపీపీజీసెట్-2025 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈ నెల 2 నుంచి మే నెల 5వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే అపరాధరుసుంతో మే నెల 5 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అలసత్వం వహిస్తే చర్యలు

– కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధిహామీ పథకం అమలులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో డ్వామా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనుల పురోగతిలో ఏపీడీలు, ఏపీఓలు పూర్తి స్థాయిలో నిమగ్నమై పనిచేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రధానంగా భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన ఫారమ్ పాండ్ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి ప్రతి మండలంలో మోడల్ ఫారమ్ పాండ్‌లను నాణ్యతతో నిర్మించాలన్నారు. డ్వామా పీడీ రవికుమార్, ఏపీడీ, ఏపీఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీసులు వెంటనే ఇవ్వండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పెండింగ్ వ్యవసాయ సర్వీసులను వెంటనే విడుదల చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇన్ని రోజులు ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్ కొరత కారణంగా వ్యవసాయ సర్వీసులు విడుదల చేయలేకపోయమన్నారు. ప్రసుత్తం అవన్నీ వచ్చాయని, రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలన్నారు. సకాలంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసి పంపాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని నివారించాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, వాసుదేవరెడ్డి, అమర్‌బాబు, జగదీష్, ఏఓ ప్ర సన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి దిగుబడిపై అంచనా

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో మామిడి సాధారణ దిగుబడిని ఉద్యానశాఖ అధికారులు రకాల వారీగా అంచనా వేశారు. జిల్లాలో 54,732 హెక్టార్లల్లో పలు రకాలు సాగులో ఉండగా 5,47,320 మెట్రిక్‌ల వరకు దిగుబడి రావచ్చని అధికారుల అంచనా వేశారు. తోతాపురి రకం అత్యధికంగా 42,204 హెక్టార్లు ఉండగా 4,22,040 మెట్రిక్ టన్నులు దిగుబడి రావచ్చని అంచనాలో చూపించారు. నీలం 3,904 హెక్టార్లకు 39,040 మెట్రిక్ టన్నులు, అల్ఫోన్సో 2,005 హెక్టార్లకు.. 20,050 మెట్రిక్ టన్నులు, బేనీషా 4,100 హెక్టార్లకు 41,000 మెట్రిక్ టన్నులు, ఇతర రకాలు 2,520హెక్టార్లకు గాను 25,200 మెట్రిక్ టన్నులు రావచ్చని అధికారులు తమ ముందస్తు అంచనాలో పేర్కొన్నారు. అయితే ఈసారి దిగుబడి సాధారణ అంచనా కంటే పెరగవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద రియల్ వెంచర్ వేస్తున్న అక్రమార్కులు





కబ్జాలు.. కిడ్నాప్‌లు

దాడులు..దౌర్జన్యాలు

కబ్జాలు.. దాడులు.. దౌర్జన్యాలు.. కిడ్నాప్‌లు.. బెదిరింపులతో కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. ఖాళీగా కనిపించిన ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. వివాదాస్పద స్థలాల విషయంలో పెద్దమనుషులుగా అవతారమెత్తి అసలుకే ఎసరు పెట్టేస్తున్నారు. అప్పు వసూలు పేరుతో రౌడీయిజం చేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులందరూ ప్రత్యేక బృందంగా తయారై అందిన కాడికి దోచేసుకుంటున్నారు. మామూళ్లతో అధికారుల కళ్లకు గంతలు కట్టేస్తున్నారు.

రెచ్చిపోతున్న కూటమి నేతలు

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా
- ప్రశ్నిస్తే దాడులు.. దౌర్జన్యాలు
- 'భూ'చోళ్లకు సహకరిస్తున్న అధికారులు
- కిడ్నాప్‌లకు సైతం తెగబడుతున్న పచ్చమూక
- వైన్‌షాపు యజమానులకు బెదిరింపులు
- ఇష్టారాజ్యంగా మద్యం దందా

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి గూండాల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. మధ్యస్తం పేరుతో వివాదాస్పద భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో దందాలు, వ్యాపారుల కిడ్నాప్‌లతో ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై జనం మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆయా పార్టీల నేతలు అన్ని వర్గాల వారిని వేధిస్తున్నారు.

మద్యం డీలర్లతో ఒప్పందం?

చిత్తూరు నియోజక వర్గ పరిధిలోని షాడో ఎమ్మెల్యే పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా మద్యం దుకాణాల యజమానులను తన కనుసన్నల్లోకి తెచ్చేసుకున్నారు. ఈ క్రమంలోనే మద్యం డీలర్లతో కూడా ఇప్పటికే ఓ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. డిమాండ్ లేని బ్రాండ్లను అమ్మిస్తామని భరోసా ఇచ్చి కమీషన్ కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఒక పర్యాయం మద్యం డీలర్లతో చర్చలు సాగించినట్లు వైన్‌షాపు యజమానులు ఆరోపిస్తున్నారు. అమ్ముడుపోని బ్రాండ్లను తమకు అంటగట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహన్ పేరు చెప్పి సదరు షాడో ఎమ్మెల్యే బెదిరింపులకు దిగుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించడపోవడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మద్యం డీలర్ల నుంచి కమీషన్లు రాబట్టుకునేందుకు షాడో ఎమ్మెల్యే మరో పర్యాయం సమావేశం కానున్నట్లు సమాచారం.

రంగంలోకి ఐదుగురు

ఇటీవల తిరుపతికి చెందిన ఓ కుటుంబాన్ని కూటమి పార్టీలకు చెందిన గూండాలు కిడ్నాప్ చేసిన విషయం తెలిసింది. చేసిన అప్పు తిరిగి ఇవ్వలేదని అందరినీ ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఉదంతంపై సంబంధిత అధికారులు 'మమ' అనిపించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి నగర పరిధిలో వివాదాస్పద భూముల విషయంలో ప్రధానంగా టీడీపీ, జనసేనకు చెందిన ఐదుగురు వ్యక్తులు రంగంలోకి దిగారు. విలువైన స్థలాను ఆక్రమించుకుని పాగా వేస్తున్నారు. అందులో భాగంగా దామినేడు, తిమ్మినాయుడుపాళెం, తిరుపతి అర్బన్ పరిధిలోని దూరదర్శనం కేంద్రం ముందు వెనుక ఉన్న ఫుట్‌పాత్, ఆర్టీసీ బస్టాప్‌కు కేటాయించిన రూ.కోట్లు విలువైన స్థలాలను కబ్జా చేసి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఈ ఆక్రమణలపై రెండు రోజుల క్రితం సాక్షిలో 'భూచోళ్లు' అనే శీర్షికతో వెలుగులోకి తీసుకువచ్చినా అధికారుల నుంచి స్పందన లేదు.



కుర్రకాల్వ వద్ద వెంచర్‌కు రోడ్డు వేసిన దృశ్యం



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద ప్రభుత్వ భూమిని చదును చేయించిన కూటమి నేతలు

ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్

రేణిగుంట మండలం కుర్రకాల్వ పరిధిలో సర్వే నంబర్ 18/1బి 4.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ భూమికి పై భాగంలో చెరువు నిండితే కలుజు ద్వారా నీరు కిందికి ప్రవహిస్తుంది. రేణిగుంట-పాపానాయుడుపేట మార్గంలోని ఈ విలువైన భూమిపై టీడీపీ నేతల కన్నుపడింది. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే ఆ పార్టీ నేతలు రంగంలోకి దిగారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేరు చెప్పి ఏర్పేడు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి సహకారంతో ఈ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. స్థానికులు అడ్డుకుంటే.. ఈ భూమిని 20 ఏళ్ల క్రితమే తాము కొనుగోలు చేసుకున్నామని, ఫ్రీహోల్డ్‌లో రిజిస్ట్రేషన్ కూడా అయ్యిందని సదరు కబ్జాదారులు ఎదురు దాడికి దిగారు. దీనిపై స్థానికులు వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అలాగే తిరుపతి అర్బన్ మండలం అక్కారాంపల్లె సర్వే నంబర్ 112/11లో 273 అంకణాల ప్రభుత్వ భూమిని జనసేన నేతలు ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. సుబ్బారెడ్డి నగర్‌లో నివాసాలకు మధ్యలో ఉన్న రూ.కోట్లు విలువైన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



తిరుపతి అర్బన్ మండలం సుబ్బారెడ్డి నగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు సిమెంట్ రాళ్లు సిద్ధం చేసిన కూటమి మూక

మురళీరెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ

- ఎదురు కేసులపై చర్చ
- పోలీసుల వైఖరిపై చట్టపరంగా ముందుకు..
- విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని చిత్తూరుకు చెందిన మురళీరెడ్డి బుధవారం కలిశారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన మురళిని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి తాడేపల్లికు తీసుకెళ్లి, వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు గతవారం మురళిపై చిత్తూరుకు చెందిన దాదాపు 30 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విజయానందరెడ్డి, మురళిని తాడేపల్లికు తీసుకెళ్లి దాడి జరిగిన తీరు, సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైన దృశ్యాలను చూపించారు. తదనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నేతలు పెట్టించిన కేసులను కూడా ప్రస్తావించారు. మురళి శరీరంపై గాయాలను జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించి, పరామర్శించారు. అనంతరం మురళిపై పోలీసులు ఏఏ సెక్షన్లు పెట్టారు?, ఎదురు కేసులు పెట్టిన తీరుపై వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేత విజయానందరెడ్డితో చర్చించారు. రాష్ట్ర లీగల్ విభాగం నాయకులతో మాట్లాడి, తప్పుడు కేసులు పెట్టిన పోలీసులపై చట్టపరంగా ముందుకు వెళతామని స్పష్టం చేసినట్లు విజయానందరెడ్డి తెలిపారు. టీడీపీ తాటాకుచప్పుళ్లకు చిత్తూరులోని ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త భయపడాల్సిన పనిలేదని తమ అధినేత సూచించారన్నారు. ప్రశ్నించేవారిపై దాడులు చేసుకుంటూ వెళితే.. దాన్ని ప్రతిఘటించి, ప్రజా కోర్టులో నిలబెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.



టీడీపీ విధ్వంసంపై తీసిన చిత్రాలను వైఎస్ జగన్‌కు చూపుతున్న విజయానందరెడ్డి

కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి

- హామీలు పరిష్కరించకపోతే ఆందోళనలు
- కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, టీచర్ల హామీలను వెంటనే పరిష్కరించాలని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘ సమాఖ్య) జిల్లా చైర్మన్ మణిగండన్ డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు బుధవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఉపాధ్యాయుల సంక్షేమానికి పలు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు గంటామోహన్ మాట్లాడుతూ జీఓ నంబర్ 117 అమలుకు ముందు ఉన్న తెలుగు మీడియం, మైనర్ మీడియం పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం అంగీకరించకపోవడం అన్యాయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో సైతం స్థానిక భాషలో బోధన చేయాలని ఉందని, దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుభాష ఆత్మాభిమానం పునాదిగా ఏర్పడిన ఈ ప్రభుత్వం తెలుగు మీడియం రద్దుకు కంకణం కట్టుకోవడం సబబు కాదన్నారు.

ఆర్థికపరమైన అడ్డంకులు తొలగించాలి

ఉపాధ్యాయులు విధి నిర్వహణ అడ్డుగా ఉన్న ఆర్థిక పరమైన అడ్డంకులను కూటమి ప్రభుత్వం వెంటనే తొలగించాలని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు జీవీ రమణ డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి మునీర్ రెహమాన్, ఉపప్రధానకార్యదర్శి మదన్ మోహన్‌రెడ్డి, ముక్తార్ అహ్మద్, మునాఫ్ , నాయకులు సోమశేఖర్‌నాయుడు, మోహన్‌యాదవ్, కిరణ్, లక్ష్మీపతిరెడ్డి, జ్యోతిరామ్, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పనాయుడు, ఎస్పీభాషా, రెహానాబేగం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం.. వేగవంతం

నిర్ణీత సమయం.. సిబ్బంది నియామకం.. ఏర్పాట్లు సిద్ధం.. వారంలో పూర్తి చేయాలన్న లక్ష్యం.. ఇందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తం.. త్వరితగతిన వెల్లడికానున్న పరీక్షల ఫలితం.. వెరసి పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం వేగవంతం కానుంది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియకు చిత్తూరులోని పీసీఆర్ స్కూలు వేదికైంది.

- నేటి నుంచి పది మూల్యాంకనం ప్రారంభం
- పీసీఆర్ పాఠశాలలో పకడ్బందీ ఏర్పాట్లు
- వారం రోజులు సాగనున్న ప్రక్రియ
- నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటన



పీసీఆర్ పాఠశాలలో మూల్యాంకనం కోసం ఏర్పాటు చేసిన డెస్కులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నుంచి పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మూల్యాంకన ప్రక్రియకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వివిధ సబ్జెక్టుల టీచర్లు, హెచ్ఎంలు హాజరుకానున్నారు. ఈ ప్రక్రియకు డీఈఓ వరలక్ష్మి క్యాంప్ ఆఫీసర్‌గా, స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మరో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు వ్యవహరించనున్నారు. వివిధ జిల్లాల నుంచి మూల్యాంకన కేంద్రానికి వచ్చిన జవాబుపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూల్యాంకనానికి 1,244 మంది నియామకం

పదో తరగతి జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు 1,244 మందిని నియమించారు. మూల్యాంకనానికి చీఫ్ ఎగ్జామినర్ (సీఈ) 130, అసిస్టెంట్ ఎగ్జామినర్ (ఏఈ) 744, స్పెషల్ అసిస్టెంట్లు 370 మందిని మూల్యాంకన విధులకు కేటాయించారు. వారందరికీ ఐడెంటీ కార్డులు ఇవ్వనున్నారు. విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐడీ కార్డులను వేసుకోవాలని ఆదేశాలిచ్చారు. మూల్యాంకన కేంద్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు వినియోగించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మూల్యాంకన ప్రక్రియను సీసీ కెమెరాల్లో పర్యవేక్షించనున్నారు. విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొదటి రోజు మూల్యాంకన కేంద్రంలో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవని తెలిపారు. గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు. జిల్లాకు వచ్చిన 2 లక్షల జవాబుపత్రాలను దిద్దనున్నారు. తొలుత ప్రతి ఉపాధ్యాయుడికి 40 పేపర్లు ఇస్తారు. నిర్దేశిత వ్యవధిలో దిద్దితే మరో 10 పేపర్లు ఇస్తారు.

ఓపెన్ పరీక్షల మూల్యాంకనం నేటి నుంచే..

ఓపెన్ స్కూల్ పరీక్షల ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం సైతం గురువారం నుంచే ప్రారంభం కానుంది. ఇందుకు పీసీఆర్ జూనియర్ కళాశాలలోని కొన్ని గదులను కేటాయించారు. ఈ మూల్యాంకన ప్రక్రియ ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనుంది. జిల్లాకు వచ్చిన 18 వేల ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పేపర్లను దిద్దనున్నారు.

ఏడు రోజుల్లోనే పది మూల్యాంకనం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏడు రోజుల్లోగా పూర్తి చేసేలా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను మూల్యాంకన కేంద్రంగా గుర్తించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఈ మేరకు మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లను డీఈఓ వరలక్ష్మి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు బుధవారం పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరూ హాజరు కావాల్సిందే



మూల్యాంకన విధులకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా విధులకు హాజరుకావాల్సిందే. ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవు. నిబంధనల ప్రకారం మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మూల్యాంకనం నిర్వహించే సమయంలో సెల్ ఫోన్లు వినియోగించేందుకు వీల్లేదు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో మూల్యాంకనం విధులను నిర్వహించాలి. పీసీఆర్ పాఠశాలలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

గ్రేడ్-3 ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి తుది జాబితా సిద్ధం

– నేడు కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతి తుది జాబితా సిద్ధమైంది. జిల్లాలో 1,069 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఉన్నారు. గతేడాది ప్రభుత్వం ఉద్యోగోన్నతి విషయాన్ని ప్రకటించింది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ క్రమంలో కొంత మంది ఉద్యోగోన్నతి కోసం తప్పుడు పత్రాలు సమర్పించారు. ఈ విషయాన్ని ఆ శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత ఉద్యోగోన్నతికి 307 మందితో కూడిన ప్రొవిజన్ మెరిట్ లిస్టు విడుదల చేశారు. దీంతో ఆ జాబితాపై విమర్శలు వెలువెత్తాయి. గందరగోళం నెలకొంది. కొంతమంది తమకు ఉద్యోగోన్నతికి అవకాశం ఉన్న జాబితాలో పేర్లు లేవని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరికొంత మంది తాము ఉద్యోగంలో చేరిన తేదీ ప్రకారం జాబితా తయారీ జరగాలని పట్టుపట్టారు. కార్యాలయం ఎదుట నిరసనగా దిగారు. దీంతో జాబితా తయారీ విషయాలు బయటకు వస్తున్నాయని, నలుగురితోనే తుది జాబితాను గుట్టుచప్పుడు కాకుండా సిద్ధం చేశారు. ఇక ఈ జాబితా తయారీ ప్రారంభం నుంచి వస్తున్న విమర్శలు తారస్థాయికి చేరడంతో కలెక్టర్ కల్పించుకున్నారు. కౌన్సెలింగ్ బాధ్యతలను కలెక్టరే తీసుకున్నారు. ఆ ప్రక్రియ గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరగనున్నట్లు డీఎంహెచ్ఓ సుధారాణి తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి జాబితా తయారు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

నోటీస్ బోర్డు

• నేటి నుంచి ఆధార్ క్యాంపులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు అధికారులు ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహించనున్నారు. ఆరేళ్ల లోపు పిల్లలకు, ప్రిమిటివ్ ట్రిబల్ గ్రూపులకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు. ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు మరో విడత క్యాంపులు నిర్వహించనున్నారు.

• 123 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, నగరాల్లోని 123 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ ఉచితంగా నిర్వహిస్తారు. అలాగే ఈకేవైసీ ప్రక్రియ సైతం చేస్తారు. జిల్లాలో ఆధార్‌కార్డు లేని పిల్లలు 23 వేల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారందరికీ ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.

• స్లాట్‌బుకింగ్ రేపటికి వాయిదా

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టిన స్లాట్‌బుకింగ్ విధానం శుక్రవారం నుంచి అమలు చేయనున్నారు. బుధవారం నుంచి అమలు చేయాలని భావించినా.. సాంకేతిక కారణాలతో వీలుకాలేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఆర్వో కార్యాలయంలో మొదట స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారుల అవగాహన కోసం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. స్లాట్ బుకింగ్ విధానం, గంటకు ఎన్ని స్లాట్స్ బుక్ చేసుకోవచ్చు.. తదితర అంశాలతో వీటిని పెట్టామని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు.

కొత్త మార్గం.. మణిహారం

కుప్పం– బెంగళూరుల మధ్య కొత్త మార్గం ఏర్పాటు కానుంది. ఈ జాతీయ రహదారి నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. ఈ రోడ్డు తమిళనాడు, కర్ణాటకతోపాటు రాష్ట్రానికి మణిహారంగా మారనుంది. ఈ కొత్తమార్గం పూర్తయితే రాష్ట్రంలోని పలు గ్రామాలకు రవాణా సౌకర్యం పెరగడంతోపాటు అభివృద్ధికి భీజం పడనుంది.

- కుప్పం– బెంగళూరుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే
- ఇప్పటికే టెండర్లు పిలిచిన ఎన్‌ఎహెచ్‌ఆర్‌ఐ
- జూన్ 3న తెరవనున్న టెండర్లు
- మూడు రాష్ట్రాలను కలిపే ఫోర్‌లేన్ రోడ్డు



కుప్పం-బెంగళూరుకు హొసూరు మీదుగా నిర్మించనున్న ఫోర్‌లేన్ హైవే ఊహా చిత్రం

పలమనేరు: కుప్పం వయా హొసూరు మీదుగా బెంగళూరుకు కొత్తగా ఫోర్‌లైన్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రానుంది. ఆమేరకు ఎన్‌హెచ్‌ఆర్‌ఐ ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే రూపొందించింది. ఆ మేరకు దీనికి సంబంధించిన టెండర్లను మార్చి 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆపై టెండర్లను తెరిచి పనులు మొదలు పెట్టనున్నారు. దీంతో కుప్పం నుంచి తమిళనాడులోని హొసూరు, కర్ణాటక రాజధాని బెంగళూరుకు మరో కొత్తమార్గం రానుంది.

కొత్త రోడ్డుతో తగ్గనున్న దూరం

ఇప్పటివరకు కుప్పం నుంచి బెంగళూరుకు వయా కేజీఎఫ్, కోలారు, హొసకోట మీదుగా 118 కిలోమీటర్లు వెళ్లాలి. మరో మార్గంగా కుప్పం నుంచి కృష్ణగిరి వయా హొసూరు, ఎలక్ట్రానిక్ సిటీ, బెంగళూరుకు 115 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంది. కానీ ఈ కొత్త మార్గం కృష్ణగిరికి వెళ్లకుండా కుప్పం నుంచి వయా హొసూరు మీదుగా బెంగళూరుకు వెళ్లే రహదారి రాబోతోంది. తద్వారా బెంగళూరుకు 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. అలాగే ఈ కొత్త మార్గంలోని ఎన్నో గ్రామాలకు ఫోర్‌లైన్ రోడ్డుతో రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతోపాటు అభివృద్ధి జరగనుంది.

కొత్త రహదారుల్లో భాగంగా..

కేంద్ర ప్రభుత్వం ఏపీలో వచ్చే రెండున్నరేళ్లలో 3,300 కొత్త హైవేల నిర్మాణానికి ఇప్పటికే రూ.76 వేల కోట్లతో అంచనాలను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే జిల్లాలోని కుప్పం వయా హొసూరు బెంగళూరు మార్గం రానుంది. ఎట్టకేలకు కుప్పం నుంచి మూడు రాష్ట్రాల మీదుగా తక్కువ దూరంతో ప్రయాణ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

బాలిక ఆత్మహత్య

వి.కోట : ఇంట్లో మందలించారని ఓ బాలిక మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని మరణించిన సంఘటన వి.కోట మండలంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వి.కోట మండలం కుమ్మర మడుగు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక గ్రామంలోని తన మేనమామ వద్ద ఉంటూ కర్ణాటక రాష్ట్రం రామసాగరం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో ఆ బాలిక ఓ అబ్బాయి తో ఇన్‌స్టాగామ్‌లో తరచూ చాటింగ్ చేస్తుందని గమనించిన ఆమె మేనమామ ఈ విషయమై బాలికను ప్రశ్నించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక బుధవారం మండలంలోని పచ్చరుమాకులపల్లి వద్ద మామిడితోటలోని చెట్టుకు ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

పిల్లల జీవనశైలిలో మార్పులు అవసరం



బంగారుపాళెం భవిత కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న జయప్రకాష్‌నాయుడు

బంగారుపాళెం: ఆటిజం పిల్లల జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఐఈ కోర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లె భవిత కేంద్రంలో బుధవారం 'ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం' నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆటిజం అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే జీవితకాల నాడీ సంబంధిత రుగ్మతన్నారు. ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తుల నైపుణ్యాలు, అవసరాలు కాలక్రమేణా మారవచ్చన్నారు. ఆటిజంపై అవగాహనతో అటువంటి వారికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆటిజం పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అముద, ఐఈఆర్‌టీలు హిమబిందు, మీరయ్య పాల్గొన్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం కేసులో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బియ్యం

శాంతిపురం: తమిళనాడు నుంచి రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న వాహనం స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం ఎతికపల్లె వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటు వైపు వస్తున్న కర్ణాటక వైపునకు బియ్యం బస్తాలతో వెళ్తున్న మినీ టెంపోను ఆపి తనిఖీ చేయగా అందులో తమిళనాడు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలోని సుమారు రూ.90 వేల విలువ చేసే 58 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వాహనంలో ఉన్న నడింపల్లెకు చెందిన తులసిరామ్, వి.కోట మండలం పత్రపల్లె నివాసి కుశాల్‌కుమార్, గుడుపల్లి మండలం యామగానిపల్లె వాసి చెందిన నాగేంద్రను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

13 నెలల జీతాలు ఇవ్వకపోతే ఎలా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలలు జీతాలు ఇవ్వకపోతే ఎలా? అని సీఐటీయూ సంఘం గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు ప్రశ్నించారు. ఆ సంఘం నాయకులు, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను కూటమి చిన్నచూపు చూడడం సరికాదని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు సంవత్సరానికి పైగా జీతాలు ఇవ్వకపోవడం సమంజసం కాదని మండిపడ్డారు. అనంతరం డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీ తర్వాత సమ్మెలోకి వెళతామని అధికారులకు సమ్మె లేఖ అందజేశారు. అనంతరం డీఆర్వో మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భారతి, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు, నాయకులు హనుమంతు, ఓబులేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక విద్యకు ప్రాధాన్యం

– జిల్లా సైన్స్ నోడల్ అధికారి అరుణ్‌కుమార్



జిల్లా స్థాయి పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటున్న జీడీ నెల్లూరు విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పాఠశాల స్థాయి నుంచే వ్యవస్థాపక విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా సైన్స్ నోడల్ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యవస్థాపకతపై అవగాహన కల్పించి, నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈఎండీపీ జిల్లా మేనేజర్ అనిత మాట్లాడుతూ పాఠశాల స్థాయి తర్వాత సమాజంలో పదిమందికి ఉపాధి కల్పించేలా ఎదగాలన్నారు. అనంతరం జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ ఆవిష్కరణలను నెలకొల్పారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ శిక్షకులు మోహన్, రవి (జీడీనెల్లూరు), వెంకటరమణ (టి.నడుమూరు, కుప్పం), లీనా కుమారి (కార్వేటినగరం), విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు ఇలా..

- వ్యవస్థాపక మనస్తత్వ జిల్లాఎక్స్‌పో–2025లో కుప్పం మండలం టీ.నడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఆర్గానిక్ వ్యవసాయం– పల్లెసీమ నుంచి పౌష్టికాహారం అనే ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు.
- కార్వేటినగరం జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ బాలికలు విద్యార్థులు రూపొందించిన వ్యర్థ పదార్థాల నిర్వహణ అనే అంశంపై తృతీయ బహుమతి సాధించారు.

జీడీ నెల్లూరు విద్యార్థుల ప్రతిభ

గంగాధర నెల్లూరు: వ్యవస్థాపక మనస్తత్వ జిల్లాఎక్స్‌పో–2025లో గంగాధర నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో గంగాధర నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రూపేష్, లీలా ప్రసాద్, హరి రూపొందించిన మల్టీపర్పస్ ప్రొటెక్షన్ స్టిక్ ఫర్ ఫార్మర్ అనే ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి దక్కించుకుందని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దినకర్ తెలిపారు. ఉపాధ్యాయుడు రవి పర్యవేక్షించారన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పుత్తూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా బుధవారం చేసిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిచ వారి వద్ద నుంచి రూ.9,600 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ బి.మురళీమోహన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. వడమాలపేట గ్రామంలోని గుంటకట్టవీధిలో నివాసమున్న వల్లెమ్మ(45) ఇంట్లో దాడి చేయగా ఇంట్లో 700 గ్రాముల గంజాయి దాచి ఉండగా గుర్తించి, దానితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వల్లెమ్మ(45), ఆమె కుమారుడు ఢిల్లీప్రసాద్(27)ను అరెస్టు చేశారు. వల్లెమ్మ గతంలోనూ గంజాయి కేసులో పట్టుబడి, ఏడాది జైలుశిక్ష అనుభవించి విడుదలైంది. ఈమెపై నిఘా ఉంచడంతో మళ్లీ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పక్కా సమాచారంతో దాడి చేసి అరెస్టు చేశారు. దాడుల్లో సీఐ మురళీమోహన్, ఎస్‌ఐలు శివప్రసాద్, స్వామినాథన్, సిబ్బంది రవి, చంద్రశేఖర్, మునిరెడ్డి, డేవిడ్, చిరంజీవి, మోహతాజ్, హారతిలు పాల్గొన్నారు.

అభివృద్ధి ఎంచి.. లక్ష్యమించి..

మార్కెట్ కమిటీ అభివృద్ధే ధ్యేయంగా ఆ ఏఎంసీ సిబ్బంది కృషి చేశారు. పన్ను వసూళ్లలో చిత్తశుద్ధితో వ్యవహరించారు. అత్యధికంగా పన్ను వసూళ్లు సాధించి, చిత్తూరు జిల్లాలో పలమనేరు ఏఎంసీని అగ్రస్థానంలో నిలిపారు. ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

- వసూళ్లలో పలమనేరు ఏఎంసీ టాప్
- లక్ష్యసాధన కోసం ప్రత్యేకంగా కృషి



పలమనేరు మార్కెట్ కమిటీ కార్యాలయం

పలమనేరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో జిల్లాలోనే పలమనేరు మార్కెట్ కమిటీ ఈ ఏడాదిలో ప్రథమస్థానంలో నిలచింది. ఈ ఏఎంసీకి మార్కెటింగ్ శాఖ పన్ను వసూళ్ల లక్ష్యం 2024కి సంబంధించి రూ.10.49 కోట్లుగా నిర్ణయించింది. కాగా మార్చి 31నాటికి లక్ష్యం రూ.8.59 కోట్లతో 82 శాతం లక్ష్యాన్ని సాధించి జిల్లాలోనే పలమనేరు ఏఎంసీ అగ్రస్థానంలో నిలిచింది. స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రత్యేక చేసిన కృషితోనే ఇది సాధ్యమైంది. దీంతో జిల్లా మార్కెటింగ్ అధికారి పరమేశ్వరన్ స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శిని అభినందించారు.

జిల్లాలో పలమనేరుదే అగ్రస్థానం

చిత్తూరు జిల్లాలో పది ఏఎంసీలున్నాయి. ఈదఫా ఊహించని రీతిలో పలమనేరు మార్కెటీ కమిటీ రాయలసీమలోనే పన్ను వసూళ్లలో నంబర్–1గా నిలిచింది. జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో రైతులు పండించిన 240 రకాల వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలపై సంబంధించి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇందులోనూ ప్రభుత్వం గతంలో కొన్ని ఉత్పత్తులపై మినహాయింపులు ఇచ్చింది. ఇలాంటి పరిస్థితిలోనూ పలమనేరు అగ్రగామిగా నిలిచేందుకు ఈ ప్రాంతం అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడమే కారణమైంది.

వసూళ్లలో పలమనేరు మేటి



జిల్లాలోని అన్ని ఏఎంసీల కంటే ఈసారి పలమనేరు మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో ముందుంది. దీనికి కారణం అక్కడి అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఆహార, పశువుల దాణా పరిశ్రమలు, పాల డెయిరీలు పన్నులపై దృష్టి సారించారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాల సరిహద్దుల నుంచి వచ్చే వాహనాలపై సెస్‌లును పటిష్టంగా వసూలు చేశారు. దీంతో వారు మేటిగా నిలిచారు.

– పరమేశ్వరన్, డిస్ట్రిక్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్

సిబ్బంది కృషిని మరువలేం



ఏఎంసీ ఆర్థికంగా బలోపేతం కావాలంటే పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ముందుగానే పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాం. ఆ మేరకు సూపర్‌వైజర్లు సైతం తమ విధులను పక్కాగా నిర్వహించారు. దీంతో గత మూడేళ్లుగా పలమనేరు ఏఎంసీ పన్ను వసూళ్లలో టాప్‌గానే నిలిచేందుకు మేమంతా సమష్టిగా కృషి చేశాం. అందుకే సాధించగలిగాం.

– సంజీవకుమార్, ఏఎంసీ కార్యదర్శి, పలమనేరు

వక్ఫ్ బిల్లు తిరస్కరించాలని ముస్లింల నిరసన



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాసేందుకు ప్రవేశపెడుతున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తిరస్కరించాలని ముస్లింలు నిరసన ర్యాలీ చేశారు. బుధవారం పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ముస్లింలు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నల్లచట్టాలతో శాంతి భద్రతలు క్షీణిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వక్ఫ్ బోర్డు సవరణ చట్టాల బిల్లును తిరస్కరించాలని కోరారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా బుధవారం నగరంలోని ముస్లింలు నిరసన చేపట్టారు. ఎస్‌డీపీఐ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుతో ముస్లింల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. బిల్లుతో వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణ పెరుగుతుందన్నారు. నాయకులు ఆసిఫ్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఖోఖో విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ఆల్ ఇండియా సివిల్ సర్వీసు ఖోఖో పోటీల్లో కాంస్య పతకం సాధించిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ మాట్లాడుతూ జిల్లాలోని యాదమరి మండలం జెడ్పీ కొట్టాలం గ్రామాని కి చెందిన పీఈటీ సురేష్‌కుమార్, కుప్పం మండలం జెడ్పీ మిట్టపల్లి పీడీ ముత్తు, బైరెడ్డిపల్లి మండలం తీర్థం జెడ్పీ హైస్కూల్ పీడీ దేవేంద్ర ఖోఖో పోటీల్లో గెలుపొంది కాంస్య పతకం సాధించారని వెల్లడించారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత భవిత

– పాలిసెట్, ఏపీఆర్‌జేసీ అవగాహన సదస్సుకు స్పందన



పాలిసెట్, ఏపీఆర్‌జేసీపై అవగాహన కల్పిస్తున్న విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు చేస్తే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆ విద్యాసంస్థలో నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ నమూనా పరీక్ష, అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ, పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్, మెటలర్జి, త్రీడి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, పెట్రోలియం, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ రిఫ్రిజరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్హతతో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌బీ, రైల్వే, బెల్, బీఎస్‌ఎన్‌ఎల్, ఆర్టీసీ, విద్యుత్ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోను, అలాగే కార్పొరేట్ సంస్థల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వీటిలో డిప్లొమో చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారని, దీనికి దరఖాస్తు చేసుకోవడానికి 15వ తేదీ ఆఖరు అని, అలాగే ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఈ నెల 25వ తేదీ ఉంటుందని, దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ ఆఖరు అని తెలిపారు. గత 35ఏళ్లుగా సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీ ఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందుతున్నట్టు చెప్పారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. సదస్సులో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు స్వైరవిహారం



ఒంటరి ఏనుగు దాడిలో విరిగిన మామిడి కొమ్మలు, రాలిన సపోటా కాయలు

తవణంపల్లె: మండల సరిహద్దుల్లోని గంగవరం మండల పరిధిలో ఉన్న కంపెనీ ఎస్టీకాలనీ ఎస్టీలకు చెందిన భూముల్లో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు స్వైరవిహారం చేసింది. పంటలను నాశనం చేసింది. కంపెనీ ఎస్టీకాలనీలో ఎస్టీలు సుమారు 40 ఏళ్లుగా నివాసంముంటూ తమ పొలాల్లో మామిడి, సపోటా, అరటి తదితర పంటలను సాగు చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం, వెంకటేష్ పొలాల్లోని చొరబడి మామిడి కొమ్మలు విరిచివేసింది. సపోటా చెట్లలోని కాయలను నాశనం చేసింది.